స్కెచ్

# వట్టి పర్సు

కొమ్మూరి వేణుగోపాలరావు

"ఏమండోయ్! మిమ్మల్నే?"

మొదటిసారి కేక వినిపించినప్పుడు తనను కాదనుకుని నడిచిపోతున్న వెంకట్రావు తప్పని సరిగా ఆగాడు తన ముందు మరెవరూ లేక పోవటంచేత.

సాయంత్రం ఆరు కావస్తున్నది. వెంకట్రావు ఆఫీసునుంచి యింటికి వస్తున్నాడు. గుమాస్తా గిరి చేస్తున్నా బట్టలు బాగానే వున్నాయి మరి. రాత్రికి తిండి గింజలు యెలాగా అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు, ఒకటో తారీఖు ఇంకా పది రోజులు వుండటంచేత.

సరిగ్గా అదే సమయంలో ఎవరో వెనకాల నుంచి పిలిచినట్లు వినిపించింది. మొదట తనను కాదనుకున్నాడుగాని తన ప్రక్కన, ముందు సందు చివరవరకూ గోచరించనందున తననే అనుకోవలసి వచ్చింది.

వెంకట్రావుదగ్గరకు ఒకాయన రొజుకుంటూ వచ్చాడు. ఆయన చేతిలో నల్లగా మిలమిలా మెరిసిపోతూ ఒక మనీపర్సు వున్నది. అది తన కిచ్చేస్తే యెంత బాగుండును!

"ఏమండీ పిలుస్తే పలకకుండా వెళ్ళిపోతున్నారేం?"

"అహా, వినిపించలేదు లెండి" ఆయనని గుర్తుతెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"ఏమీలేదు. ఈ పర్సు మీదేనా?"

వెంకట్రావు త్రుళ్లిపడ్డాడు. హారి! తన వూహ నిజమయిపోయింది.

ఒకసారి ఖాళీ జేబు తడుముకుని "అరె జారిపోయిందే. థ్యాంక్స్" అంటూ ఆ వ్యక్తి తనకు అందివ్వకపోయినా చేతిలోంచి లాక్కున్నాడు తెలివైనవాడు.

"చిత్తం మీదే ననుకున్నా" చేతులు నలుముకుంటూ నిల్చున్నాడు ప్రతిఫలానికి అపేక్షిస్తూ సత్తెకాలపు మనిషి.

వెంకట్రావుకు తనకు అంత అదృష్టాన్ని కలిగించిన ఆసామీకి ఏదో చేతిలో పెడతామని వున్నా పర్సులో ఏమయినా వుంటుందో, అసలు వుండదో అన్న భయంచేత మరోసారి థ్యాంక్స్ చెప్పి నడక సాగించాడు.

వెనక ఆసామీ తెల్లబోతున్నాడన్న ఆలోచన త్రోసివేసి ఆ పర్సులో యెంత వుందో, తనకి అదృష్టం యెలా సంభవించిందో? అన్న ఆలోచనలతో యింటిపట్టు చేరుకున్నాడు.

గుమ్మంలోనే యెదురయ్యాడు భాస్కరరావు. అంటే తన మేనమామ. మరో సమయంలో అయితే చింతించేవాడు. కాని ఇప్పుడు తన జేబులో... అమ్మో' చాలాభారం.

"ఏం మామయ్యా? ఎప్పుడూ రావటం?"

ఎందుకోగాని మామయ్య ముఖంలో కళ లేదు. "ఇప్పుడేనోయ్" అన్నాడు.

కుశల ప్రశ్నలూ, ఖులాసా కబుర్లూ అయిపోయాయి. మొహం కడుక్కువద్దామని లోపలకు వెళ్ళాడు వెంకట్రావు. అంతవరకూ భర్త గారి బంధువుకి భోజనం పెట్టటం ఎలాగా అని ఆలోచిస్తున్న అన్నపూర్ణ భర్త ఆగమనం చూచి సగం తృప్తి వహించింది.

"ఎలాగండీ?"

"ఏమిటి?"

"తిండిమాట"

వెంకట్రావు నిర్లక్ష్యంగా అన్నాడు. "ఓస్. అంతేనా?" జేబులో పర్సు భారంగా వుంది.

అన్నపూర్ణ ఆశ్చర్యపోయి, "అదేమిటండీ. అలా అంటారు?" అని అడిగింది.

"గోల చెయ్యబోక. బజారు కెళ్ళి బియ్యం తెస్తాను గాని" అని తువ్వాలుతో ముఖం తుడుచుకోవటంలో నిమగ్నుడయాడు.

భర్త స్వభావం తెలుసుకున్న దవటంచేత మళ్ళీ అడిగితే ఎక్కడ కసురుకుంటాడో అని ఆలోచనలకే వదిలి వేసింది సందేహాన్ని.

"ఇప్పుడే వస్తాను. వుండు మామయ్యా" అన్నాడు బయటికి వచ్చి వెంకట్రావు.

"ఏం? ఎక్కడికి కెళ్తున్నావు?"

"ఇక్కడికే. ఏదో యింట్లో వెచ్చాలు పట్రావాలి"

భాస్కరరావు మామయ్య పడక కుర్చీలో దిగబడి పోయాడు అంతులేని ఆలోచనలతో.

మనీపర్సు పుణ్యమా అంటూ ఆ రాత్రి భోజనాలు గడిచి పోయాయి. వెంకట్రావు ఆ రాత్రి డబ్బు లెక్కజూచాడు, ఖర్చులయిం దాంతో సహా ముప్పయి ఎనిమిది రూపాయలు. తన జీతం? డెబ్బయి రూపాయలు. ఇంచు మించు సగం జీతం. తన పదిహేను రోజుల కష్టం అనాలోచితంగా లభించింది.

"ఏం మామయ్యా! సినిమాకు వెళ్దామా?" ఆ రాత్రి తొమ్మిదింటికి అడిగాడు. ఎందుకో ఆయన ముఖం మాడింది.

"ఆఁ ఎందుకూ?"

"పర్వాలేదులే మామయ్యా! యింట్లో కూర్చుని ఏం చేస్తాం?"

ఈ సంభాషణ వింటూన్న అన్నపూర్ణ ముఖం కలకల్లాడింది. సినిమా చూసి ఎన్నాళ్ళయిందో. తను చదువుకునే రోజుల్లో వారానికో సినిమా లెక్క తప్పకుండా చూచేది. ఇప్పుడు రెండు నెలలకోసారయినా గగనం అయింది.

ఆ రాత్రి సినిమా చూసేశారు. వెంకట్రావుకు తెలిసినంత వరకూ వాళ్ల మామయ్య చాల ఖర్చుపెట్టే మనిషి. ఆయన డబ్బుతో యిది వరకు తనెన్నో సార్లు సినిమా కెళ్ళాడు. అటు వంటిది యివాళ మాట మాత్రమయినా "నేను కొంటానులే" అనలేదు. వెంకట్రావు సంతోషించాడు. తన జీవితంలో మామయ్యవంటి వాడిని అభ్యంతరం లేకుండా సినిమాకు తీసుకు వెళ్ళాడు. ఎందుకో మామయ్య ముభావంగా వున్నాడు. ఎప్పటిలా సరదాగా లేడు.

మూడు రోజులు గడిచాయి. మనీపర్సు దయవల్ల పరువు నిలుస్తూ వచ్చింది.

ఆ రోజు వుదయం భాస్కరరావు బట్టలు సర్దేసుకున్నాడు.

"ఇంక నేను వెళ్తానోయ్?"

"అదేమిటి? అప్పుడేనా నాలుగు రోజులయినా వుండందే?" ఆశ్చర్యం అభినయిస్తూ అన్నాడు.

"కాదోయ్. పనులున్నాయి."

"సరే. నీ యిష్టం"

ఆయన అంతా సిద్ధమయి పోయి "ఏమోయ్ నీతో ఒకమాట చెప్పాల్నోయ్" అన్నాడు.

తనతో చెప్పవలసిన మాటేమిటో అర్థం గాక, "ఏమిటి మామయ్యా?" అన్నాడు.

"మరి ..."

"చెప్పు"

"మరి నేను యీవూరు వచ్చేటప్పుడు డబ్బు పారేసుకున్నానోయ్. టిక్కెట్టు డబ్బయితే వెంటనే ఎమ్. ఓ. చేసేస్తాను." పాపం సిగ్గు పడుతూ చెప్పాడు.

"అరే. సరే. ఎంత కావాలి. పది చాలా?" చాలా సాద్మికం కనబరిచాడు వెంకట్రావు.

"ఆ! ఎందుకూ? అయిదు చాలు."

"సరే" వెంకట్రావు పర్సుతీసి అయిదు రూపాయలు లెక్కబెడుతున్నాడు.

ఇంతలో ఎదుటనున్న మనిషి తేలు కుట్టిన వాడిలాగ "అరె. ఆ పర్సు నీ కెక్కడిది? అది నాది" అన్నాడు గుర్తు బడుతూ.

"దొరికింది" అనేశాడు తెలివి తక్కువ వాడు.

"థ్యాంక్సు" అతను యివ్వకపోయినా చేతుల్లోంచి లాగేసుకున్నాడు ఆయన.

వెంకట్రావు వంచిన తల ఎత్తలేదు.

"పద్దెనిమిదిరూపాయలు తక్కువయ్యాయే" అని మామయ్య నోట్లోంచి వచ్చిన మాటలు వెంకట్రావు చెవుల్లో రింగులు తిరుగుతున్నాయి.

---

సిటీ బస్సులో చివరికి ఒక్క మనిషే మిగిలాడు. పరిచితుడైన అతన్ని కండక్టరు అడిగాడు: "నిన్న రాత్రి మీరు తిన్నగా యింటికి చేరుకోగల్గారా?" అని. ఆ మనిషి ఆశ్చర్యంగాచూస్తే కండక్టరు మళ్ళీ అన్నాడు: "మరేం లేదు. నిన్న కూడా బస్సు యిలాగే ఉంది, ఇంతలో ఓ ఆడమనిషి ఎక్కితే మీరు లేచి నించుని సీటు యిచ్చారు!"